
భోలక్‌పూర్ ప్రభుత్వ బాలికల వసతి గృహంలో రాఖీపండగ నిర్వహించిన హిప్నో పద్మాకమలాకర్

ఐక్యత, ప్రేమను తెలిపేదే రాఖీ పండగ

ముషీరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఐక్యత, ప్రేమను తెలిపేదే రాఖీ పండుగ అని ప్రొగ్రెసివ్ సైకాలజిస్ట్ అసోసియేషన్ అధ్యక్షురాలు హిప్నో పద్మాకమలాకర్ అన్నారు. ఆదివారం భోలక్‌పూర్‌లో ప్రభుత్వ బాలికల వసతి గృహంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలచే రాఖీలు కట్టించి పండగ ప్రాముఖ్యతను వివరించారు. బాలికలకు దుస్తులు పంపిణీ చేశారు. మహిళలను గౌరవించి, రక్షించే వారికే పండగ శుభాకాంక్షలు తెలపాలని సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ భానుప్రియ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు రాఖీలు కట్టిన బ్రహ్మకుమారీలు



రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని బ్రహ్మకుమారీ తిలక్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం అంబర్‌పేట సీపీఎల్‌లోని పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో పోలీసులకు బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టి స్వీట్ తినిపించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీ తిలక్‌నగర్ శాఖ ప్రతినిధులు శ్రీలత, సురేఖ, వసంత, సంగీత, మాధవి, రామమోహన్, గాయత్రి, లక్ష్మారెడ్డి, భాస్కర్, సురేందర్, రమేష్ పాల్గొన్నారు.

- నల్లకుంట, ఆంధ్రజ్యోతి

వేంకటేశ్వరాలయంలో పవిత్రోత్సవాలు ప్రారంభం

చిక్కడపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి పవిత్రోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పవిత్రాహ్వనము, స్వస్తివాచనము, రక్షాబంధనము, రుత్విక్‌కరణము, అగ్నిప్రతిష్ట, మూర్తిహోమము, హవనము, వేదప్రబంధ పారాయణము, ఆరగింపు, మంత్రపుష్పము, తీర్థప్రసాద గోష్ఠి కార్యక్రమాలను ఆలయ పండితులు నిర్వహించారు. ఈవో రామాంజనేయులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

చిక్కడపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ. 5,30,500 విలువైన చెక్కులను ముషీరాబాద్ నియోజకవర్గంలోని రాంనగర్, భోలక్‌పూర్, కవాడిగూడకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆదివారం గాంధీనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వినియోగదారుల మండలి
జాతీయ ప్రధానకార్యదర్శిగా చక్రపాణి

చిక్కడపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల మండలి జాతీయ ప్రధానకార్యదర్శిగా సాంబరాజు చక్రపాణి మరోసారి ఎన్నికయ్యారు. ఆయన ఈ పదవిలో రెండేళ్లు కొనసాగుతారు. గుజరాత్ అంబాజీలో రెండు రోజులపాటు వినియోగదారుల సమావేశాలు జరిగాయి. శుక్రారం జరిగిన ముగింపు సమావేశంలో కేంద్ర కమిటీ ఎన్నికలు నిర్వహించగా.. తెలంగాణనుంచి సాంబరాజు చక్రపాణి జాతీయ ప్రధానకార్యదర్శిగా ఎన్నికయ్యారు. సీనియర్ కార్యదర్శిగా పల్లెపాడు దామోదర్, కార్యదర్శిగా శివపార్వతి ఎన్నికయ్యారు. చక్రపాణి మాట్లాడుతూ.. వినియోగదారుల హక్కుల రక్షణకు కృషి చేస్తానన్నారు.


శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

పార్కుల ఆధునికీకరణకు కృషి : ఎమ్మెల్యే గోపాల్

ముషీరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పార్కుల ఆధునికీకరణకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బాపూజీనగర్‌కు చెందిన గడసంతల శ్రీనివాస్ పద్మారావునగర్ పార్కు అసోసియేషన్ సభ్యుడిగా నియమితుడైన సందర్భంగా ఆదివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బస్తీలు, కాలనీల్లో సమస్యల పరిష్కారానికి కమిటీలు కృషి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా పార్కులో శ్రావణ మాస అమ్మవారి బోనాలను నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పద్మారావునగర్ పార్కు అసోసియేషన్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ముఖ్యసలహాదారుడు చంద్రశేఖర్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు
హైడ్రా తరహా వ్యవస్థ ఏర్పాటు చేయాలి

నల్లకుంట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) తరహా వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎస్.హెచ్.రంగయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో పర్యావరణ సమస్యలు నెలకొంటున్నాయన్నారు. పర్యావరణ పరిరక్షణకు బలమైన వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఏపీ, తెలంగాణ రాష్ట్రాల సీఎంలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

సింగాడికుంటలో ఘనంగా బోనాలు

కవాడిగూడ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సింగాడికుంట మునిసిపల్ క్వార్టర్స్‌లో ఆదివారం శ్రావణమాసం బోనాల పండగను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు మహాకాళి, అంబికా దేవాలయంలో బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నగర ప్రధాన కార్యదర్శి, మునిసిపల్ క్వార్టర్స్ బస్తీ కమిటీ అధ్యక్షుడు పి.లక్ష్మణ్, బస్తీ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న వల్లభనేని ప్రసాద్ తదితరులు

రాంనగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని దివ్యాంగుల సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సంఘం కార్యాలయంలో డిమాండ్ల కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. దివ్యాంగుల పింఛన్ పెంచాలనీ, రాష్ట్రం అంతా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, దివ్యాంగుల హక్కుల చట్టం 2016ను పటిష్ఠంగా అమలుచేయాలని, దివ్యాంగులకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటుచేయాలని, ఇందిరమ్మ ఇళ్ల పథకంలో 5 శాతం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. డిమాండ్ల సాధన కోసం ఈనెల 21న ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు.

పాపన్నగౌడ్ ఆశయసాధనకు కృషి చేయాలి

రాంనగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కల్లు గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అమరుల యాదిలో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న రాష్ట్ర కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగోని బాల్‌రాజ్‌గౌడ్, కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్‌బాబు పాపన్నగౌడ్ విగ్రహానికి తాటి, ఈత కమ్మల దండవేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గౌడ కులస్థుల ఆరాధ్యుడు కాటమయ్య స్ఫూర్తితో వన సంరక్షణ చేపట్టాలని, సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. ట్యాంక్ బండ్‌పై పాపన్న విగ్రహం ఏర్పాటు చేయాలని, జనగామ జిల్లాకు పాపన్న పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు, ఉడుత రవీందర్, రమేష్, గుమ్మడి రాజు నరేష్, ఎం. కృష్ణస్వామి తదితరులు పాల్గొన్నారు.


పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బీజేపీ నాయకులు

● తెలంగాణ బహుజనుల ఆత్మగౌరవానికి, ధీరత్వానికి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ప్రతీక అని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి. సాయిబాబా అన్నారు. సబ్బండ వర్గాలకు రాజకీయ, సామాజిక సమానత్వం కోసం కృషి చేసిన వ్యక్తి పాపన్న అని కొనియాడారు. ఆదివారం టీడీపీ నగర కార్యాలయంలో పాపన్నగౌడ్ 374వ జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పి. బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు నాగులూరి జగదీష్‌గౌడ్, చంద్రమోహన్‌గౌడ్, వై.ఎల్. నర్సింహగౌడ్, కిరణ్ పాల్గొన్నారు.

నల్లకుంట: తెలంగాణ బీసీ జాగృతి ఆధ్వర్యంలో ఆదివారం నల్లకుంటలో పాపన్నగౌడ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు కేపీ మురళీకృష్ణ, లాలయ్య గౌడ్, జి. కృష్ణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బాల్‌రాజ్‌గౌడ్, ఎంవీ రమణ, భూపతి వెంకటేశ్వర్లు తదితరులు

● బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఆదివారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ రెడ్‌బిల్డింగ్ చౌరస్తాలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి నిర్వహంచారు. నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ కార్పొరేటర్ నేమూరి సాంబశివగౌడ్, నాయకులు పి. గోవర్ధన్‌రెడ్డి, చుక్క జగన్, డాక్టర్ హరిచరణ్, ఇ.ఎస్.ధనుంజయ, ఏడెల్లి అజయ్‌కుమార్, వంజరి రవీందర్ తదతరులు పాల్గొన్నారు.




సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్‌కు నివాళులర్పిస్తున్న తెలుగుదేశం, బీసీ జాగృతి, బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు

మహిళా డాక్టర్ హంతకులను కఠినంగా శిక్షించాలి

కవాడిగూడ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కోల్‌కతాలో మహిళా డాక్టర్ హత్యను నిరసిస్తూ ఆదివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో ప్రసూతి గైనకాలజీ సొసైటీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు శాంతకుమారి, సుభాకర్ మాట్లాడుతూ.. దేశంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే పటిష్ఠమైన చట్టాలను తీసుకురావాలని, డాక్టర్లకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనను రాజకీయ పార్టీలు, మహిళా సంఘాలు ఖండించకపోవడం విచారకరమన్నారు. మెడికల్ కాలేజీలు, ఆస్పత్రులలో ఉమెన్ సెల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నిరసన ర్యాలీలో మహిళా డాక్టర్లు, జూనియర్ డాక్టర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


ఇందిరాపార్కు వద్ద నిరసన ర్యాలీలో డాక్టర్లు


భోలక్‌పూర్‌లో నిరసన తెలుపుతున్న సీఐటీయూ, ఐద్వా కమిటీ నాయకులు

నిందితులను ఉరితీయాలి

ముషీరాబాద్: పశ్చిమబెంగాల్‌లో వైద్యురాలిని హత్య చేసిన నిందితులను ఉరితీయాలని ఐద్వా, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం భోలక్‌పూర్ లేబర్ అడ్డావద్ద నిరసన తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మల్లేష్, బాబు, ఐద్వా నాయకులు అనిత, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగతెప్పోత్సవం

ముషీరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్‌లోని మహాత్మానగర్‌లో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గంగ తెప్పోత్సవ ర్యాలీ నిర్వహించారు. గంగపుత్ర సంఘం అధ్యక్షుడు, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కో-ఆర్డినేటర్ బిజ్జి కనకేష్‌కుమార్ స్థానికంగాగల బంగారు మైసమ్మ దేవాలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించి ర్యాలీని ప్రారంభించారు. జాలర్లు, బోనాలు, పోతరాజులు, కళాకారుల నృత్య ప్రదర్శనతో ర్యాలీ ట్యాంక్‌బండ్ వరకు నిర్వహించారు. ర్యాలీలో మహాత్మానగర్ గంగపుత్ర సంఘం ప్రధాన కార్యదర్శి నర్సింగ్‌రావు, నాయకులు పెంటం రాములు, యాదయ్య అంజయ్య, రాజయ్య, బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం. రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.


గంగ తెప్పోత్సవ ర్యాలీలో గంగపుత్రులు

21న భారత్ బంద్‌ను విజయవంతం చేయండి

కవాడిగూడ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా ఇచ్చిన సుప్రీం కోర్టు తీర్పును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 21న నిర్వహించే భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నేతలు పిలుపునిచ్చారు. దళిత పార్టీలు, ఎస్సీ కుల ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సమావేశంలో ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ మాట్లాడుతూ.. రాజ్యాంగ రిజర్వేషన్లను రద్దు చేయడానికి సుప్రీంకోర్టు తీర్పు ద్వారా పాలక మనువాద ప్రభుత్వాలు ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. వర్గీకరణకు వ్యతిరేకంగా ఈనెల 21న దేశంలో అంబేడ్కర్ విగ్రహాల వద్ద ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. వర్గీకరణ అంతం, దళితుల పంతం అనే నినాదంతో పెద్దఎత్తున పోరాటాలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వీఎల్ రాజు, రాష్ట్ర అధ్యక్షుడు జేఎన్ రావు, జాతీయ ఉపాధ్యక్షులు జొన్నల గడ్డ భాస్కర్‌రావు, ఆలిండియా ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్స్ ఫోరం తెలంగాణ ప్రధాన కార్యదర్శి పసుల రాజలింగం, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. అశోక్ తదితరులు పాల్గొన్నారు.


అభివాదం చేస్తున్న ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నేతలు

మద్యం మత్తులో వ్యక్తిపై దాడి

- చికిత్స పొందుతూ మృతి
- ఘటన ఆలస్యంగా వెలుగులోకి


నరేందర్ (ఫైల్)

కవాడిగూడ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తులు ఓ వ్యక్తిపై దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన అతడు గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భోలక్‌పూర్‌లో నివసిస్తున్న ఎ. నరేందర్(37) మోండా మార్కెట్‌లో హమాలీగా పనిచేస్తున్నాడు. ఇతడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రతిరోజూ పని ముగించుకొని బోయిగూడలో కల్లు కాంపౌండ్‌లో మద్యం తాగి ఇంటికి వెళ్లేవాడు. ఈనెల 5న బోయిగూడలో మద్యం తాగి అపస్మారక స్థితిలో ఉన్నాడు. కల్లు కాంపౌండ్ యజమాని నరేందర్ ఇంటి సమీపంలో ఉంటున్న భాగ్య అనే మహిళకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. విషయం తెలుసుకున్న నరేందర్ తల్లి విజయలక్ష్మి కాంపౌండ్ వద్దకు వెళ్లి స్థానికుల సహాయంతో కుమారుడిని ఆటోలో ఇంటికి తీసుకెళ్లింది. నరేందర్ నొప్పులతో బాధపడుతుండడంతో స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లింది. వైద్యులు పరీక్షించి మరో ఆస్పత్రికి తీసుకెళ్లమని చెప్పారు. వెంటనే గాంధీనగర్‌లోని నర్మదా ఆస్పత్రికి తీసుకెళ్లింది. అక్కడ సరిగా చికిత్స అందకపోవడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో.. తనతో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు గొడవపడి తీవ్రంగా కొట్టారని చెప్పాడు. ఈనెల 16న నరేందర్ తల్లి గాంధీనగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. నరేందర్‌పై దాడి చేసిన వ్యక్తుల కోసం మూడు పోలీసు బృందాలు గాలిస్తున్నాయని ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు.

'నింబోలిఅడ్డా బాయ్స్ హాస్టల్‌ను పునఃప్రారంభించాలి'

పంజాగుట్ట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ నింబోలిఅడ్డాలోని సాంఘిక సంక్షేమ బాయ్స్ హాస్టల్‌ను వెంటనే తిరిగి ప్రారంభించాలని హాస్టల్ ఓల్డ్ స్టూడెంట్స్ కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఆర్. సునీల్, కమిటీ సలహాదారులు రామ్మూర్తి, సంఘమేశ్వర్, రుద్రవరం లింగస్వామి మాట్లాడారు. కరోనా సాకుతో ప్రభుత్వం హాస్టల్‌లో ఐదేళ్ల క్రితం మూసివేసిందన్నారు. కరోనా అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ హాస్టల్స్‌ను తిరిగి ప్రారంభించినా కాచిగూడ బాయ్స్, బోలక్‌పూర్‌లోని బాలికల హాస్టల్స్‌ను ఇప్పటి వరకు తిరిగి ప్రారంభించలేదన్నారు. హాస్టల్‌ను ప్రారంభించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న హరియాణా రాష్ట్ర గవర్నర్ దత్తాత్రేయ

కురుమ సమితి బ్రోచర్ ఆవిష్కరణ

బర్కత్‌పుర, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కురుమల సంక్షేమాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందని రాష్ట్ర కురుమ మహిళా సమితి అధ్యక్షురాలు బైగొండ లలిత, ఓబీసీ సెంట్రల్ కమిటీ అధ్యక్షురాలు ఎం. భాగ్యలక్ష్మి ఆరోపించారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్‌కోటా కేటాయించాలని పోరాటం చేస్తామన్నారు. ఆదివారం కురుమ మహిళా సమితి బ్రోచర్‌ను హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సభ్యురాలు అంబిక తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ గ్రిల్స్‌పై నాగుపాము


గ్రిల్స్‌పై నాగుపాము

చిక్కడపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ సత్తార్ బాగ్‌లో ఫుట్‌పాత్ గ్రిల్స్‌పై నాగుపాము కనిపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. స్థానికుడు అభిషేక్ కెన్నడీ స్నేక్ సొసైటీ వారికి సమాచారం ఇవ్వడంతో సంస్థ ప్రతినిధులు వచ్చి పామును పట్టుకెళ్లడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

బాలిక అదృశ్యం

బర్కత్‌పుర ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలిక అదృశ్యమైంది. ఇసామియా బజార్‌లో నివసిస్తున్న కైలాస్ కుమార్తె ఆర్. ఆకృతి(13) ఆదిలాబాద్‌లో అమ్మమ్మ వద్ద ఉంటూ ఎనిమిదో తరగతి చదువుతోంది. వరుసగా సెలవులు రావడంతో నగరంలో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వచ్చింది.

ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలిక తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో తండ్రి కైలాస్ కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేసిన ఎంపీ ఆర్. కృష్ణయ్య తదితరులు

అర్హులందరికీ విదేశీ విద్య స్టైఫండ్ ఇవ్వాలి

రాంనగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ విదేశీ విద్య స్టైఫండ్ ఇవ్వాలని, బీసీలకు 300 మందికి కాదు 2 వేల మందికి ఇవ్వాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో కృష్ణయ్య మాట్లాడుతూ.. ఒక శాతం జనాభా గల బ్రాహ్మణులకు 100 మందికి విదేశీ విద్య స్టైఫండ్ ఇస్తున్నారనీ, 52శాతం జనాభా గల బీసీలకు 300 మందికి ఇవ్వడం శోచనీయమన్నారు. బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి అర్హత గల వారందరికీ విదేశీ విద్య స్టైఫండ్ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నాయకులు వేముల రామకృష్ణ, సి. రాజేందర్, సతీష్, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

అసిస్టెంట్ మెకానిక్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రాంనగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ముషీరాబాద్ డిపోలో అసిస్టెంట్ మెకానిక్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని డిపో మేనేజర్ దివాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐలో ఏదైనా ట్రేడ్‌లో ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని, ఆసక్తిగల అభ్యర్థులు డిపోకు వచ్చి సంప్రదించవచ్చన్నారు.


హరికి నియామకపత్రం అందజేస్తున్న ఆనంద్‌గౌడ్

భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి
గోల్నాక డివిజన్ కన్వీనర్‌గా హరి

గోల్నాక, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి గోల్నాక డివిజన్ కన్వీనర్‌గా వరికుప్పల హరి నియమితులయ్యారు. భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి అంబర్‌పేట నియోజకవర్గం కన్వీనర్ గంధమల్ల ఆనంద్‌గౌడ్ ఆయనకు ఆదివారం నియామకపత్రం అందజేశారు. డివిజన్ కో-కన్వీనర్లుగా కె.శ్రీకాంత్ ఎం.అరుణ్‌కుమార్, కె.కృష్ణ నియమితులయ్యారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మూల రవీందర్‌గౌడ్, పార్టీరాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కేసరి నర్సింగ్‌రావుయాదవ్, భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి అంబర్‌పేట నియోజకవర్గం కో-కన్వీనర్ ఎస్.శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'పద్మశాలీల శాశ్వత భవన నిర్మాణానికి కృషి'

ముషీరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలో పద్మశాలి కులస్థుల కోసం శాశ్వత భవన నిర్మాణానికి తన వంతు కృషిచేస్తానని పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న వల్లకటి రాజ్‌కుమార్ అన్నారు. ఆదివారం పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్ష ఎన్నికలు భోలక్‌పూర్ డివిజన్ పద్మశాలి కాలనీలో జరిగాయి. స్థానికంగా ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో రాజ్‌కుమార్ ఓటు వేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 45శాతం ఓటింగ్ జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడి సతీమణి రామశోభారాణి, పద్మశాలి సంఘం అధ్యక్షుడు బింగి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మేస్త్రీ కార్మిక సంఘం అధ్యక్షుడి మృతి

ముషీరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గం మేస్త్రీ కార్మిక సంఘం అధ్యక్షుడు, గంగపుత్ర కాలనీ ఉపాధ్యక్షుడు పూస నర్సింహ (66) ఆదివారం గంగపుత్ర కాలనీలోని తన నివాసంలో మృతిచెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు పూస గోరక్‌నాథ్, రాంనగర్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు నాగేందర్, నాయకులు మల్లేష్, జగదీష్ తదితరులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. నర్సింహకు భార్య, నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి


వ్యక్తి మృతదేహం

బర్కత్‌పుర, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. కాచిగూడ రైల్వేస్టేషన్‌లో మూడవ నంబర్ ప్లాట్‌ఫారంపై ఓ వ్యక్తి చనిపోయి ఉన్నాడని పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పబ్‌లో యువతులపై దాడి

రాయదుర్గం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎల్ఎన్ పబ్‌లో ఇద్దరు అమ్మాయిలతో పాటు ఓ వ్యక్తిపై గుర్తుతెలియని వ్యక్తులు అసభ్యకరంగా మాట్లాడి దాడి చేశారు. ఈ సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. కొండాపూర్‌కు చెందిన ప్రశాంత్‌కుమార్ తివారి శనివారం రాత్రి 11.30 గంటలకు ఇద్దరు స్నేహితురాళ్లతో కలిసి ఎస్ఎల్ఎన్ పబ్‌కు వెళ్లాడు. తిరిగి 12.30 గంటలకు ఇంటికి వెళ్లేందుకు కారు వద్దకు వచ్చారు. అదే సమయంలో పక్కన ఉన్న నలుగురు యువకులు అమ్మాయిల పట్ల అసభ్యంగా కామెంట్లు చేశారు. ఎందుకు కామెంట్ చేస్తున్నారని తివారి నలుగురు యువకులను అడగగా.. దుర్భాషలాడుతూ అతడిపై దాడి చేశారు. వారిని అడ్డుకునే ప్రయత్నం చేసిన అమ్మాయిలపైనా దాడి చేసి పారిపోయారు. తివారి గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.